సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్టను సకల వసతుల క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, జూన్ 12 : యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా సకల వసతులతో కూడిన దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. వెయ్యి మంది నిద్రించేలా వసతి గృహం, కొండకింద అన్నదాన సత్రంలో నిత్యన్నదానం, కొండపైన మరో లిఫ్టు, ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యాదగిరిగుట్ట కొండపైన ఆలయ ఈఓ, అనువంశిక ధర్మకర్త, ప్రధానార్చకులతో బుధవారం కొండపైన అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కొండపై భక్తులు సేద తీరేందుకు శాశ్వత షెడ్‌ను నిర్మిస్తామన్నారు. గిరి ప్రదక్షిణలో 5వేల మంది పాల్గొనే విధంగా రోడ్డును ఆధునీకరిస్తామని చెప్పారు. భక్తుల తాకిడి పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ అనుమతులతో అర్చకుల నియామకం చేపడుతామన్నారు. స్వయంభూ మూర్తులను చూసే విధంగా క్యూలైన్లు, కొండకింద వైకుంఠ ద్వారం వద్ద ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిన్నారులకు మదర్ ఫీడింగ్ కేంద్రం, దివ్యాంగులకు ప్రత్యేక చొరవతో దర్శనం కల్పించడం స్వాగతిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకులు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఈఈ రామారావు, దయాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ సునీల్, ఆలయ ఏఈఓలు జూశెట్టి కృష్ణ, శ్రవణ్‌కుమార్, గజవెల్లి రమేశ్, రామ్మోహన్, రఘు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

యాదగిరిగుట్ట, జూన్ 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులకు కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. సుమారు 18వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.28,32,118 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి మాజీ ఎమ్మెల్యే నరసింహారెడ్డికి సునీత పరామర్శ

యాదగిరిగుట్ట, జూన్ 12 : భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డిని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను బుధవారం కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మాజీ ఎమ్మెల్యే నరసింహారెడ్డితో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రైతుల సంక్షేమమే లక్ష్యం : దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, జూన్ 12 : రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం రూ.70లక్షల లాభాల్లో ఉన్నదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేస్తున్నట్లు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.2,22,342 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులకు పంట రుణాలు లక్ష నుంచి రెండు లక్షల వరకు ఇవ్వాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, డైరెక్టర్లు బోరెం నర్సిరెడ్డి, దుబ్బాక శశిధర్ రెడ్డి, దుర్క కృష్ణ, పబ్బతి వెంకటయ్య గౌడ్, దొడ్డి శ్రీశైలం, బొడ్డు పద్మ, సప్పిడి వెంకట్‌రెడ్డి, బాతరాజు సాయిలు, దౌడి బాలరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దామోదర్‌రెడ్డి

శ్రీచైతన్య పాఠశాలకు అనుమతి లేదు : ఎంఈఓ

మోత్కూరు, జూన్ 12 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీచైతన్య పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేవని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అనుమతి లేని పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌ను నాశనం చేయవద్దన్నారు. ఒకే ఆవరణలో రెండు పాఠశాలలు నడుపుతుండడంతో పర్మిషన్ ఇవ్వకుండా రద్దు చేశామని తెలిపారు. అనుమతులు ఉన్నాయని మోసం చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్న సదరు పాఠశాల యాజమాన్యంపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

భువనగిరి అర్బన్, జూన్ 12 : పట్టణంలో బుధవారం ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తాగూర్ రోడ్డు మార్గంలో వృద్ధురాలు కూనూరు భారతమ్మ నివాసం ఉంటుంది. బుధవారం ఉదయం 5:30 గంటల సమయంలో ఆమె ఇంటికి ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఇంటి పత్రాలు కావాలని డోర్ తీయమని పిలిచాడు. అది నమ్మిన భారతమ్మ డోర్ తీయగా ఆమె నోరు మూసి మెడలో ఉన్న రెండు తులాలన్నర బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

8 నామినేషన్లు

భూదాన్ పోచంపల్లి, జూన్ 12 : పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో భాగంగా బుధవారం 8 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పోవనం శ్రీనివాస్, కర్నాటి భార్గవి, పిల్లలమర్రి అర్చన, గోలి యాదగిరి, తడక రమేశ్, బోడ దయానంద్, రాపోలు జ్ఞానేశ్వర్, పిల్లలమర్రి నరేందర్ నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలను స్వయం కృషితో సాధించాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

విద్యార్థులు, రెడ్‌క్రాస్ సభ్యులతో కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 12 : విద్యార్థులను లక్ష్యాలను ఎంచుకొని స్వయం కృషితో సాధించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పది జీపీఏ సాధించిన 68 మంది విద్యార్థులకు బుధవారం మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన రంగాల్లో అభివృద్ధి చెందాలని, విజయం సాధించడానికి లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని అన్నారు. ఫోన్లపై నియంత్రణ ఉండాలని, వ్యక్తిత్వ వికాసంపై శ్రద్ధ పెట్టాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ కె.గంగాధర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ మానవతా వాదాన్ని చాటేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. ఇది స్ఫూర్తివంతమైన కార్యక్రమమని, 31 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది జీపీఏ సాధించడం హర్షణీయమని డీఈఓ కె.నారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ స్టేట్ మెంబర్ ఆర్.మహేందర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, డైరెక్టర్లు వెంకటేశ్, అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు బడులను సద్వినియోగం చేసుకోవాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
● విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూన్ 12 : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నదని, సర్కారు బడులను అన్ని వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొత్త అడ్మిషన్లు చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ ఆదేశ సూత్రాలు సాధించుకోవడం కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సూచించారు. విద్యాధికారులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి తాను కృషి చేస్తానని, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి పి.యాదయ్య, తాసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దబ్బేటి శైలజ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆర్.రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతో మహిళ హత్య

● బావిలో నెట్టేసి.. పరారైన ప్రియుడు

మోత్కూరు, జూన్ 12 : మున్సిపాలిటీ కేంద్రంలో వివాహేతర సంబంధంతో ఓ మహిళ హత్యకు గురైంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన మాకొల్ల నర్సయ్య వంట మనిషిగా పని చేస్తున్నాడు. తను నివాసం ఉంటున్న కాలనీలో ఉండే మాటూరి కవిత (38)తో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరూ మంగళవారం ఇంటి నుంచి వెళ్లారు. బుధవారం మోత్కూరులో కవిత బంధువైన కొంగరి మమత ఇంటికి వచ్చారు. వీరు మమత ఇంట్లో మందుతో విందు చేసుకున్నారు. ఆ తర్వాత ఇంటికి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్ద స్నానం కోసం వెళ్లారు. ఈ క్రమంలో నర్సయ్య కవితను బావిలో నెట్టివేసి ఆమె సెల్ ఫోన్ తీసుకొని పరారయ్యాడు. బావిలో ఈత కొడుతున్న పుష్పతోపాటు కొందరు కవితను కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే కవిత నీట మునిగింది. మృతురాలి బంధువు మమత పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి అగ్నిమాపక సిబ్బందితో బావిలో గాలింపు చేయడంతో కవిత మృతదేహం లభ్యమైంది. శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలికి భర్త కిష్టయ్య, కొడుకు ఉన్నాడు. రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కవిత (ఫైల్)

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం

● జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షిస్తున్న ఎంవీఐ ఇమ్రాన్

భువనగిరి అర్బన్, జూన్ 12 : రవాణా శాఖ నిబంధనలు పాటించని స్కూల్ బస్సులను సీజ్ చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి సాయికృష్ణ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్, పర్మిట్లను బుధవారం రెన్యూవల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు అన్ని రకాల ధ్రువపత్రాలు రెన్యూవల్ చేసుకుని ఉండాలన్నారు. ఇప్పటికి జిల్లాలో 238 స్కూల్ బస్సులకు పర్మిట్, ఫిట్‌నెస్ చేశామని తెలిపారు. ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, లైసెన్స్ గడువు తేదీ ఉండాలని, ఆ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంబంధిత పత్రాల గడువు ముగిసిన వాహనాలకు జరిమానాతోపాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు ఇమ్రాన్, ఆనంద్ శ్యామ్‌ప్రసాద్, ఏఎంవీఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

భూమికి భూమి ఇవ్వాల్సిందే : ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు

చౌటుప్పల్, జూన్ 12 : ప్రాంతీయ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా బుధవారం నేలపట్ల భూ నిర్వాసితులతో అవార్డు ఎంక్వైరీ కోసం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు మాట్లాడుతూ తమ భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదా ఓపెన్ మార్కెట్ రేటు కట్టించాలని ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ ధరకు ఇచ్చేది లేదని, ఆ ధరతో నాలుగు ఎకరాల భూమి పోతే బయట అరెకరం కూడా వస్తలేదని తెలిపారు. రైతుల అభిప్రాయాలను నోట్ చేసుకున్న ఆర్డీఓ.. అవార్డు ఎంక్వైరీ కోసం పట్టదారు పాసు పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ కాపీలు ఇవ్వాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ సేకరణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తాసీల్దార్ హరికృష్ణ, ఆర్ఐ సురేందర్ శర్మ, రిటైర్డ్ తాసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నీటి పారుదల శాఖ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

వలిగొండ, జూన్ 12 : నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో సాగు నీరందక రైతుల నోట్లో మట్టి పడుతుందని వేములకొండ ఎంపీటీసీ సామ రాంరెడ్డితో పాటు వివిధ గ్రామాల ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూతి రమేశ్ రాజ్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు త్రైమాసిక నివేదకను శాఖల వారీగా సమర్పించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు మూసీ నదిలో వృథాగా దిగువకు పోతుందని, భీమలింగం కత్వ గండ్లను పూడ్చే ప్రయత్నం ఎందుకు చేస్తలేరని, భీమలింగం కాల్వలో పూడిక, గుర్రపుడెక్కాకు పేరుకుపోయి చివరి ఆయకట్టుకు సాగు నీరందని దుస్థితి నెలకొన్నదని పలువురు ఎంపీటీసీలు అన్నారు. మల్లేపల్లి చెరువు మరమ్మతు పనులు చేసినా బిల్లులు రావడం లేదని తెలిపారు. అధికారుల తీరుతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమా బాలనర్సింహ, డీఈ శ్రీనివాస్, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్‌రాజ్

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు రూరల్, జూన్ 12 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి బడిబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, ఎంపీపీలు గంధమల్ల అశోక్, చీర శ్రీశైలం, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, వైస్ చైర్మన్ మొరిగాడి మాధవీవెంకటేశ్‌గౌడ్, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యానంద్‌ప్రసాద్, ఎంఈఓ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

బొమ్మలరామారం : సమాజానికి మార్గదర్శకత్వం వహించే ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూళ్ల పునఃప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్‌రావు, మండల నోడల్ అధికారి రోజారాణి, జీహెచ్ఎం వరలక్ష్మి, ఎంపీటీసీ మైలారం ఈదమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య అన్నారు. మండలంలోని బస్వాపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాయగిరిలో బడిబాట స్వాగత కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అండాలు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని బీచ్‌మహళ్ల పాఠశాలకు వచ్చిన విద్యార్థులను డప్పు వాయిద్యాలతో స్వాగతించారు. పట్టణంలోని గాంధీనగర్, బీచ్‌మహళ్ల, నెంబర్–2తోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలను అలకంరించారు. గత సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా బాగాయత్ పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ దశరథ యూనిఫాం, షూ, టై, బెల్ట్, పుస్తకాలు పంపిణీ చేశారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ రమేశ్‌రాజ్ నోట్ బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. జడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాలనర్సింహ, ప్రధానోపాధ్యాయుడు సుంకోజు భాస్కర్ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బూర్గు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని పాఠశాలలో ఎంపీపీ దర్శనాల అంజయ్య విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ ప్రేమలత, ఎంపీటీసీ భారతమ్మ, ప్రధానోపాధ్యాయురాలు రహీమున్నీసా పాల్గొన్నారు.

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం సమాకూర్చిన పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కౌన్సిలర్లు ఉబ్బు వరమ్మ, ఆలె నాగరాజు, పోలోజు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలను ఎంపీపీ గుత్తా ఉమాదేవి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కొత్తగా నిర్మించిన హ్యాండ్ వాష్ సిస్టంను ప్రారంభించారు. ఎంపీటీసీ బచ్చనగోని గాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు సుమిత్ర, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని అన్ని పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించి ప్రారంభించారు. విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాలలో ఎంపీపీ మంగమ్మ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు 80శాతం వరకు పూర్తయ్యాయి.

తుర్కపల్లి : మండలంలోని దత్తాయిపల్లి పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి జినుకల శ్యామ్‌సుందర్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నపేట : జనంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన యూనిఫాం, పుస్తకాలను ఎంపీటీసీ వేమవరపు సుధీర్‌బాబు పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉమ, ప్రధానోపాధ్యాయుడు సందీప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమీలాపేట్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

బీబీనగర్, జూన్ 12 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మండలంలోని జమీలాపేట్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పోటీ పరీక్షల్లో ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. తాసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, మండల నోడల్ అధికారి సురేశ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ యర్కల విజయలక్ష్మి పాల్గొన్నారు. కొండమడుగులో వైస్ ఎంపీపీ గణేశ్‌రెడ్డి, చిన్నరావులపల్లిలో ఎంపీటీసీ గోరుకంటి బాలచందర్ విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్ అందజేశారు.

భువనగిరి కలెక్టరేట్ : విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

వలిగొండ : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అందజేస్తున్న ఎంపీపీ రమేశ్‌రాజ్

భూదాన్ పోచంపల్లి : విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు విద్యార్థుల ఎంపిక

భువనగిరి కలెక్టరేట్, జూన్ 12 : ఈ విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో గిరిజన విద్యార్థుల ప్రవేశానికి బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 10 సీట్లకు 27 మంది దరఖాస్తు చేసుకోగా.. కలెక్టర్ సమక్షంలో అధికారులు లాటరీ తీసి పది మంది విద్యార్థులను ఎంపిక చేసి యాదగిరిగుట్టలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్ పాల్గొన్నారు.


కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

నేడు మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఎన్నిక

మోత్కూరు, జూన్ 12 : మోత్కూరు నాగార్జున రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ఎన్నిక గురువారం నిర్వహిస్తున్నట్లు డీసీఓ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 11న సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై నెగ్గిన అవిశ్వాస తీర్మానంతో ఖాళీ ఏర్పడినందున గురువారం నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం కార్యాలయంలో మధ్యాహ్నం జరుగనున్న ఎన్నికకు రావాలని పాలకవర్గ సభ్యులకు నోటీసులు అందజేశారు. ఉదయం 11 గంటలకు నామినేషన్ల స్వీకరణ, మధ్నాహ్నం 12 నుంచి 12:30 వరకు నామినేషన్ల పరిశీలన, 12:30 నుంచి ఒంటి గంట వరకు నామినేషన్ల ఉపసంహరణ, 1:30 నుంచి 2గంటల వరకు చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు.

అతిథి పోస్టుల నియామకానికి దరఖాస్తులు

చౌటుప్పల్, జూన్ 12 : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దీప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగు, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, హిందీ సబ్జెక్టులను బోధించుటకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 15వరకు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

రామన్నపేట, జూన్ 12 : రామన్నపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల హాస్టల్ సంక్షేమ అధికారి ధీరావత్ రాజాలుబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే పేద విద్యార్థులు ఆధార్, రేషన్ కార్డు, రెండు ఫొటోలు, బోనోఫైడ్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో వచ్చి నేరుగా వసతి గృహంలో ప్రవేశం పొందాలని సూచించారు.